# డబ్బు డబ్బు డబ్బు

ప్లీడరు దగ్గిరికి ఎందుకైనా సలహాకి వెడితే ఏదో ఒక కేసు కల్పించి కొన్నికాలాలపాటు ఆ కేసు నడిపించి డబ్బు లాగుతాడు.

డాక్టరు దగ్గిరికి ఎందుకైనా సలహాకి వెడితే ఏదో ఒకజబ్బు కనిపెట్టి ఆజబ్బు ఆధారంగా అతడు కొంతకాలం జీవిత యాత్ర నడుపుతాడు నాడబ్బుతో. ఏవృత్తిలో ఉన్నవాడైనా సరే సలహాకిగానే వెళ్లినట్లయితే డబ్బులాగక మానడు. ఈ సంగతి నాకు అనుభవైకవేద్యమై, నాసంగతి తలచుకొని వాళ్లతో పోల్చి చూచుకొని గట్టిగా ఆలోచించడం మొదలు పెట్టాను. నేను మాత్రం ఎందుకు డబ్బు గడించకూడ దను కొన్నాను. అయితే మంచీ చెడ్డా అక్కర్లేదా, ధర్మం అధర్మం లేదా అనుకొన్నాను. పాశ్చాత్యనాగరీకవైభవంతో మురుస్తూఉన్న ఈకాలంలో అటువంటి కుతర్కాలు పెట్టు కోవడం మూర్ఖం అనిపించింది.

ఇంక నేను డబ్బుసంపాదించే మార్గా లేమిటా అని ఆలో చించాను. కవులు చాలామంది నాస్నేహితులు. వాళ్లు తప్ప కుండా వాళ్లు వ్రాసిన పద్యాదులు నాదగ్గిరికి తీసుకువచ్చి "చూడండి, ఇదికొంచెం చదివి మీఅభిప్రాయం తెలియ జెయ్యాలి. కొంచెం తొందరగా వ్రాయడంవల్ల అక్కడక్కడ దోషాలుకూడా పడిఉంటాయి. కొంచెం జాగ్రత్తగా చదివి

అక్కడక్కడ తప్పులున్నచోట మార్కులు పెట్టండి" అని అంటాడు.

ఎవరోకవి ఏదోపద్యం రాస్తే నే నెందుకు చదవాలి? నే నెందుకు అభిప్రాయం ఇవ్వాలి? నే నెందుకు తప్పులు చూపించాలి? ఈశ్రమఅంతా నేను పడడమెందుకు? డాక్టరు గారిదగ్గిరికి వెళ్లి "చూడండీ డాక్టరుగారూ, నే నోజబ్బు సంపాదించాను. కొంచం జాగ్రత్తగా పరీక్షచేసి ఏదైనామందు ఇప్పించండి" అంటే ఊరకే ఇస్తారా మందు? నేనుమాత్రం ఊరకే ఎందుకు చెయ్యాలి? అందుచేత ఈపనికి నేనుకూడా కొంత ఫీజు చార్జీ చెయ్యాలి అని ఒకరూపాయిఫీజు ఏర్పాటు చేస్తాననుకోండి. అప్పుడు ప్లీడర్లకీ డాక్టర్లకీ అడిగిన డబ్బు అడిగినంతలో తెచ్చి ఇచ్చినట్లు నాకు ఈరూపాయి మహాభాగ్యం ఇస్తాడా! ఇయ్యడు. ఇయ్యక అంటారుగదా "న్యాయమేనా మహాశయా, ఇటువంటి పనులు చెయ్యడం? మిమ్మల్ని అభిప్రాయం అడిగితే అదో గౌరవంకింద భావించుకోక శ్రమకింద భావించి డబ్బు అడుగుతా రండీ! నాపద్యం మీద అభిప్రాయం ఇచ్చినట్లయితే ఆ అభిప్రాయం నేను పుస్తకం చివర అచ్చువేస్తానే! దానివల్ల మీకెంత ఘనత! మీ అభిప్రాయం అచ్చువేసినందుకు నే నొక దమ్మిడీ అయినా మిమ్మల్ని అడగనే! ఆమాత్రం కృతజ్ఞత అక్కర్లేదా? నేడు మీదగ్గిర అభిప్రాయం పుచ్చుకొని ప్రకటిం చేనంటే రేపటినుంచి ఎంతమంది మీ అభిప్రాయంకోసం ఉత్తరాలు వ్రాస్తారు? అచిరకాలంలో మీకీర్తి దిగంత విశ్రాంతం కాదా? ఇప్పుడు అభిప్రాయం అడిగితేనే డబ్బు

కావా లంటున్నారు. ముందు వచ్చేలాభాలు మీరాలోచించడం లేదు. మీరు అభిప్రాయాలు రాయడం క్రమక్రమంగా అలవాటుపడ్డట్లయితే గ్రంథకర్తలు ముందుముందు మీచేత ఉపోద్ఘాతాలు, పీఠికలు, ముందుమాటలు, మున్నుడులు మొదలైనవి ఎన్నైనా వ్రాయించుకొంటారు. ఉపోద్ఘాతాదులు వ్రాయడం పరిపాటిగా జరిగిందంటే కొంతకాలంపాటు-మీరు పండితులైనట్లేగదా! ఈలోపుగా మీరు వ్యావహారిక భాషను తిట్టి చులాగ్గా పరిషత్సభ్యులు కావచ్చునుకూడాను. తరవాతసంగతి ఆలోచించండి. మీరు ట్రయినింగు పరీక్షలు మొదలు బి ఏ. పరీక్షలవరకూ పరీక్షపత్రాలు ఇవ్వవచ్చు. యూనివర్సిటీలో సెనేటు సభ్యులు కావచ్చు. దోసిళ్లాది డబ్బు సంపాదించవచ్చు. వెధవ రూపాయికోసం ఇప్పుడు కక్కుర్తిపడతారుటండీ, రానుండే ఈవైభవమంతా ఆలోచించుకోకుండా? "అని చిన్న ఉపన్యాసం ఇస్తాడు. ఒకమాటు సంకల్పించుకొన్నాక ఆసంకల్పం మార్చుకోవడం బుద్ధిమంతులలక్షణం కాదనుకొని నేను అడిగిన రూపాయి ఇస్తేనేకాని పద్యం చదవడం అభిప్రాయం ఇవ్వడం జరగదంటాను. అప్పు డతగాడు, "ఏదో పెద్ద మనిషిగదా అని అభిప్రాయం అడగవస్తే తీరి కూచుని రూపాయి ఇవ్వమంటున్నాడు. ఇత డెంతచేసు? ఇతడి అభిప్రాయం ఎంతచేసు? కావలిస్తే ఏపుస్తకంమీదనైనా, ఎటువంటి అభిప్రాయమైనా లక్షలాది అడిగిన తక్షణం ఇచ్చేవాళ్లు ఉంటూండగా తన్ని అడిగిందే గౌరవంకింద భావించుకోక ఫీజు కావాలంటున్నాడు. ఆంధ్రదేశంగొడ్డుబోయిందనుకొన్నాడు కాబోలు. నాపద్యం

మీద అభిప్రాయాలు ఆంధ్రదేశం నాలుగు దిక్కులనుంచీ తెప్పించి "అభిప్రాయ మణిమంజరి" అని పేరుపెట్టి ఒక గ్రంథం అచ్చువెయ్యగలనని ఎరగడు కాబోలు. కాస్త ఆశ్రయించవలసిన వాళ్లని ఆశ్రయించి నా "అభిప్రాయ మణిమంజరి" ఏ స్కూలుఫైనలుకో టెక్స్టుబుక్కుగా పెట్టించుకో లేనను కొంటున్నాడు కాబోలు. పోనీ అని అభిప్రాయం అడిగితే ఇంత తెగనీలుగా అని తిట్టుతూ వెళ్లిపోతాడు. ఇటువంటి సందర్భాల్లో డబ్బు సంపాదించడం ఎట్లా ? ఊహ ఎంతకీ తెగిందికాదు. మొట్టమొదట కొత్తగా ఉండడం వల్ల డబ్బు ఇవ్వడానికి సందేహించినా క్రమక్రమంగా డబ్బు ఇవ్వడం గ్రంథకర్తలు నేర్చుకోవచ్చు ననుకొన్నాను. కాగితాలకనీ, అచ్చుకనీ, బైండింగుకనీ డబ్బు తగలబెట్టి పుస్తకాలు వేయించుకొని ఇళ్లల్లో దాచుకోవడం లేదూ గ్రంథకర్తలు ! లాభం వస్తుందనే చేస్తున్నారా ఇదంతా? ఖర్చులో ఖర్చు! అభిప్రాయాలకోసం పది రూపాయల సొమ్ము ఖర్చుపెట్టలేరూ? అనుకొని అలవాటు అయితే వాళ్ళే ఖర్చుపెడతారనుకొని సమాధానపెట్టుకొన్నాను. పుస్తకాలకి అభిప్రాయా లివ్వడమే కాకుండా కొన్ని పుస్తకాలు చదివినందుకూ, కొందరితో మాట్లాడినందుకూకూడా ఫీజు పుచ్చుకోవచ్చును. ఈమధ్య నా స్నేహితుడొకడు ఒక పుస్తకం చదివాడు. అందులో రెండు చరిత్రకథ లున్నాయి. ఆ పుస్తకం ఖరీదు అర్ధరూపాయి. మొదటికథ చదివి అది బేడ చేస్తుందన్నాడు. రెండో కథ చదివి పావలా తనకి వస్తుందన్నాడు. బాలెన్సు బేడ, గ్రంథకర్త నా స్నేహితుడికి

బాకీపడ్డాడు—గ్రంథం ఖరీదుసంగతి అలావుండగా లోకంలో న్యాయమే ఉన్నట్లయితే, ప్రజల కష్టసుఖాలు ప్రభుత్వము వారు కనిపెట్టి చూస్తూ ఉన్నట్లయితే నా స్నేహితుడుకి బేడ రావలసినదే. కాని వస్తోందా? కలికాలంలో న్యాయం ఆశించడం తప్పు మనదే. ఇటువంటి గ్రంథాలు చదవవలసిన దురవస్థ మన కెందరికి పట్టడంలేదు? చదివినందులకు తగిన ఫీజు మనకెప్పటికప్పుడు ముట్టుతూ ఉన్నట్లయితే మన కంత కష్టముగా ఉండకపోవచ్చును. కాని ప్రతిఫలం ఇచ్చే వాడేడీ?

ఇక మాట్లాడినందుకు ఫీజు పుచ్చుకోదగ్గ మనుష్యుల్ని గురించి మనవిచేస్తాను. కొందరు పెద్ద మనుష్యులు మొహం ఎరికవాళ్లందరితోనూ స్నేహంకలుపుకొని వేళాపాళా లేకుండా వాళ్లని చూడడానికనీ వాళ్లతో మాట్లాడడానికని—బాతాఖానీ అనే పారిభాషికపదం వాడతారు. ఈ సందర్భములో—ఇళ్లకి వస్తూఉంటారు. వచ్చి వాళ్ళు చేసేదేమిటి? ఒకటి: నీవు చేసుకొనే పని చెడగొట్టడం. రెండు: నీకు ఏ మాత్రమూ ఇష్టములేని విషయాలనిగురించి ప్రసంగిస్తూ అది విని సమాధానం చెప్పడానికి నిన్ను మొహమాట పెట్టడం. మూడు: నిద్ర పోతూన్న నీపిల్లల్ని లేపి లేని ప్రేమ ఉన్నట్లు నటించి వాళ్లని ముద్దుపెట్టుకొని, నవ్వించి, పరిగెత్తించి ఏడ్పించి చివరకు వాళ్లఏడ్పు తగ్గకముందే లేచిపోవడం. నాలుగు: దాహములేనిదే మంచినీళ్లు తెప్పించుకొని పరిశీలించి చూచి సగం త్రాగి మిగిలినవి పారబొయ్యడం. అయిదు: నీతాంబూలాకు వక్కపొడో, పొడుమో, సిగరెట్లో పూర్తిగా ఖర్చుపెట్టడం. ఆరు: నీవు ఏభాండాగారంనుంచో

చదువుకోడానికి తెచ్చుకొన్న పుస్తకం తీసుకుపోయి పారెయ్యడం. ఆపుస్తకం ఖరీదు నీవు ఇచ్చుకోవడం ఇత్యాది.

ఇటువంటి మనుష్యులు నీతో మాట్లాడడానికి వచ్చినప్పుడు వాళ్ల దగ్గరనుంచి అయిటం ఒక్కంటికి రూపాయి చొప్పున ఫీజు పుచ్చుకోవాలని నీకు ఉండదూ? ఎందుకు పుచ్చుకోగూడదూ? నాగరీకం అంటారే. ఈమాత్రంఫీజు ఏర్పాటు లేని నాగరీకం ఏమి నాగరీకం? ఈ కాలంలో దేనివల్ల డబ్బు వస్తుందో అదే పనికివచ్చేపని. డబ్బురాని పని వ్యర్థం. అందుచేత మనము చేసే పనులన్నింటినుంచీ డబ్బు రాబట్టడానికి మనం ప్రయత్నం చేస్తూఉండాలి.

ఎట్లాగంటే—

"శాస్త్రుల్లుగారూ! ఏకాదశి ఎప్పుడండీ" అంటే ఫీజు "అర్థణా"

"తేలు కుట్టింది పంతులుగారు! మందు ఉందా" అంటే ఫీజు "పావలా"

"వంకాయలు వీశె ఎలా పుచ్చుకొన్నారు బజారులో" అంటే ఫీజు "కాని"

"టైమెంతయిందండీ" అంటే "అర్థణా"

"రైలుస్టేషనుకు దారి ఇదేనా" అంటే ఫీజు "అణా"

"ఈవేళ విశేషాలేమిటండీ" అంటే ఫీజు "అర్థరూపాయి"

"ఈవేళ మీటింగు ఎప్పుడండీ" అంటే ఫీజు "అణా".

"అంతా బాగున్నారా" అంటే ఫీజు "బేడ"

ఈవిధంగా ఫీజు ఏర్పాటుచేసుకొని పుచ్చుకోవడం మంచిది. "విరోచనాలకి ఒకమాత్ర ఇవ్వండి డాక్టరుగారూ"

అంటే ఆయన తాహతు ననుసరించి అణో, బేడో, పావలో మాత్రకు పుచ్చుకొంటూన్నట్లే మనమూ పుచ్చుకోవచ్చును. ఇందులో ఇంకో రహస్యంఉంది. కొందరు బుద్ధిమంతులు సర్వసాధారణముగా అందరికీ తెలిసిన, తెలియవలసిన విష యాలనుగురించి ప్రశ్నలు వేస్తూఉంటారు. అటువంటి ప్రశ్న లకు సమాధానం చెప్పవలసివస్తే ఫీజు ఎక్కువగా పుచ్చు కోవడం సమంజసమే అని చెప్పనక్కరలేదు.

"అమృతాంజనం తలనొప్పికి మంచిమందేనా" అంటే ఫీజు "పదిరూపాయలు"

"కవిత్వం చేసేవాళ్లకి ఉద్యోగాలు ఎందుకు దొరకవండీ" అంటే ఫీజు "అయిదురూపాయలు"

"ఇంగ్లీషు చదువుకొన్నవాళ్లకి ఇంగితజ్ఞానం ఉండదా" అంటే ఫీజు "ఇరవైరూపాయలు." "మీరు సిగరెట్టు కాలు స్తారా" అంటే ఫీజు "పాతికరూపాయలు".

అయితే కొందరికి తమకు తెలిసిన విషయాలు ఇతరు లకు అమ్మడం అధర్మంగా తోచవచ్చును. ఈ కాలంలో ప్లీడర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, సంగీతపాటకులు, నాటకాల వాళ్లు, చిత్రలేఖకులు ఇత్యాది అందరూ ఈ వ్యాపారమే చేస్తున్నారు. కాబట్టి ఇందులో తప్పేమీ లేదు.

ఇదిగాక మనపాలకు లయిన ఇంగ్లీషువాళ్లు మనకు అను కరణప్రాయులు కాబట్టి, వాళ్లు ఇటువంటిపనులు బాహాటంగా చేస్తున్నారు కాబట్టి, మనమూ వాళ్లను చూచి నేర్చుకో వచ్చునుగదా! యథా రాజా తథా ప్రజా అనే ఆర్యోక్తి ఉండనే ఉంది!

ఇక ఓట్లు ఇచ్చినందుకు తాహతు ననుసరించి ఉప్మా, ఇడ్డెనులు మొదలుకొని వందలకొద్ది రూపాయలు ఫీజు పుచ్చుకొనడము దేశాభ్యుదయసూచకమని వేరే చెప్పనక్కరలేదు.

ఆబాయము వృద్ధిచేసుకోవడమే పరమావధిగా పెట్టుకొన్న గవర్నమెంటులకు రివిన్యూ వృద్ధిచెందే మార్గాలు సూచిస్తున్నాను. ఇటువంటి పరమోపకారం నేను చేస్తూ ఉన్నందుకు నాకు ఒక బిరుదు వారు దయచేస్తారని ఆశించుకొని ఉండడం అత్యాశ కాదని బుద్ధిమంతు లూహించుకొందురుగాక! ఒకవేళ అటువంటి బిరుదులు ఇటువంటి సందర్భాల్లో ఇవ్వడం సమంజసం కాదని వారికి తోచినట్లయితే అధమపక్షం ఒక కంచుపతకమేనా దయచేస్తారని అనుకొంటున్నాను. తరువాత వారి చిత్తం, నాభాగ్యం. ఇక నేను సూచించే మార్గా లేమిటంటే—

౧. దేశములో ఈ కాలములో కవులూ, నవలాకారులూ, కథకులూ మొదలైన గ్రంథకర్తలున్నూ, టెక్స్టు బుక్కులు మాత్రమే వ్రాసే గ్రంథకర్తలున్నూ, అపరిమితంగా వృద్ధి జెందుచున్నారు. వారి పుస్తకాలు ప్రకటించడానికి ప్రత్యేకంగా కొన్ని కంపెనీలు ఏర్పాటైనవి. ఆ కంపెనీల దగ్గర నుంచిన్నీ, గ్రంథకర్తల దగ్గిరనుంచిన్నీ సులభముగా పన్ను వసూలు చేయవచ్చు. తద్ద్వారా రివిన్యూ వృద్ధిచేసుకోవచ్చు.

౨. నల్లమందు, కల్లు, సారాయి, గంజాయి మొదలైన వస్తువుల తయారు, అమ్మకము విషయమై గవర్నమెంటు వారు పన్నులు విధిస్తున్నారు. సంఘమునకు వీటివల్ల అపకారం కలుగుననీ, పన్నులు విధించి కట్టు దిట్టముగా పనిచేసి

నట్లయితే ఉపద్రవము శాంతించుననీ ప్రజలు బాగుపడుదురనీ వారు అనుకోవడము సమంజసముగానే ఉన్నది.

ఈ విధముగానే సంఘమునకు ఉపద్రవము కలిగించే ఇంకో సమస్య వారు పరిష్కరించి రివిన్యూ వృద్ధిచేసుకోవచ్చు. మన దేశములో ఇప్పుడు ఏ దేశములోనూ లేనంతమంది బిచ్చగాళ్లు ఉన్నారు. ఇంటింటికీ తిరిగే అన్నిజాతుల బిచ్చగాళ్ళూ గాక రైళ్లను ఆశ్రయించుకు బదికేవాళ్లూ, తీర్థాలను ఆశ్రయించుకు బదికేవాళ్లూ, మోటారుబస్సుల నాశ్రయించుకు బతికేవాళ్ళూ అనేకమంది ఉంటూన్నారు. ఇదిగాక తమ అంధత్వమునో, తమ కుంటినో, తమ కురూపమునో జీవనాధారముగా పెట్టుకొని బదికేవాళ్ళున్నూ, అనాదిగా వంశపరంపరగా బిచ్చమెత్తడమే వృత్తిగా గల వాళ్ళున్నూ, శకునాలు చెప్పడము సోదె చెప్పడము మొదలైన తమ విద్యలను జీవనాధారముగా పెట్టుకొని బిచ్చమెత్తే వాళ్ళున్నూ లక్షలాది గలరు. వీరుగాక కొందరు బిచ్చగాళ్లు తమకు సేవచేయుటకుగాను కొందరు నౌకరులను ఏర్పాటు చేసుకొని, తాము ఏ బండిలోనో కూర్చుని తమ నౌకరులచే ఆ బండి లాగించుకొంటూ ఊరూరూ తిరిగి బిచ్చమెత్తుకొంటూ తమ నౌకరులకు ఒప్పన్నమైన జీతాలిస్తూ కాలక్షేపం చెయ్యడంకూడా కద్దు.

ఇంతమంది బిచ్చగాళ్లు మనదేశములో ఉండి దానతత్పరులకు పుణ్యము సంపాదించిపెట్టుతూ స్వర్గద్వారకవాటాలు వదలిస్తూ ఉండగా వీరినిగురించి ఇంతవరకూ ఎవరూ పరిశోధనలు జరపకుండడము చాలా శోచనీయమైన

విషయము. తత్కాలంకొన్ని బాపుకొనడమునకు గాను మున్ముందు ఈ బిచ్చగాళ్లయొక్క ఆదాయ వ్యయాదులను గురించి లెక్కలు తయారు చేయవలసిఉన్నది. ఈ కార్యమును డబ్బులేని పరిశోధకులు పూనుకొని పనిచేయడము కష్టసాధ్యము. కాబట్టి అందుకై ఒక కమీషను ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఆ కమీషనుకు పరాయి దొరలు పదిమందిన్నీ, ఇండియాలో ఒక బ్రాహ్మణుడూ, అయిదుగురు బ్రాహ్మణేతరులూ, ఒక మహమ్మదీయుడూ, ఒక క్రైస్తవుడూ, ఒక సోదరీమణీ ఉంటే బాగుంటుందని తోస్తుంది. ఈ కమీషనుకు చైరుమనుగా ఒక దొరను ఏర్పాటుచేయవచ్చును. ఇందుకుగాను నాలుగులక్షల రూపాయలు బడ్జెటులోనుంచి శాంక్షను చేయవచ్చును. ఈ కమీషనుకు అన్ని సదుపాయాలూ చెయ్యవలెను. పౌరులు వీరికి సహాయము చెయ్యవలెను. రైల్వేకంపెనీవారు ప్రత్యేకముగా వీరికోసం కొన్ని బళ్ళు నడిపించవలెను. వీరు హిందూదేశము ఆసేతు హిమాచలమూ సంచరించి అందరు బిచ్చగాళ్ల సాక్ష్యమూ పుచ్చుకొని, తరువాత వారందరూ సంప్రతించుకొని ఒక స్టేటుమెంటు ప్రకటింపవలసి ఉన్నది. దానిలో ముఖ్యముగా బిచ్చగాళ్ల ఆదాయ వ్యయపట్టికలూ, వారివారి వర్ణాదులు, వారివారి విద్యలూ, జబ్బులూ, వారి నివాసములు మొదలైన విషయము లుండవలెను.

తరువాత ఈ విషయములన్నీ పరీక్షించి బిచ్చగాళ్ళమీద పన్ను విధించవలసి ఉన్నది. పన్ను విధించేటప్పుడు మాత్రం బ్రాహ్మణా బ్రాహ్మణ సమస్యా, హిందూ మహమ్మ

దీయ సమస్యా, నిమ్న జాత్యుద్ధరణ సమస్యా మొదలైన సమస్యలు మనస్సులో పెట్టుకొని బ్రాహ్మణులకు ఎక్కువగానూ, బ్రాహ్మణేతరులకు తక్కువగానూ, నిమ్న జాతులకు మరీ తక్కువగానూ పన్ను విధించ వలసి ఉంటుంది. హిందూసన్యాసులకీ, మహమ్మదీయ పకీర్లకీ పేచీ రాకుండా ఒక కమిటీ ఏర్పాటుచేసి ఆ కమిటీ నిర్ణయప్రకారం వారికి పన్ను విధిస్తే బాగుంటుంది. ఇట్లా బిచ్చగాళ్లమీద పన్ను విధించడంవల్ల తప్పకుండా చాలా డబ్బు వస్తుంది. ఆ డబ్బుతో సైన్యపు ఖర్చు హెచ్చుచెయ్య నైనా చెయ్యవచ్చును. లేదా బిచ్చగాళ్లమీద అధికారం చలాయించడానికి ఒక దొరను కమీషనరుగా ఏర్పాటు చెయ్యనైనా చెయ్యవచ్చును. ఆ దొరకింద ఇద్దరు ముగ్గురు నల్లవాళ్లని గుమాస్తాలుగాకూడా ఏర్పాటు చేయవచ్చును.

పైని సూచించిన విధముగా పీఠాధిపతులు మొదలుకొని సాధారణ భిక్షుకులవరకూ ఉన్న బిచ్చగాండ్రమీద పన్ను విధించినట్లయితే అపరిమితంగా రివిన్యూ వృద్ధి అయి భారత దేశము ఎక్కువ వైభవముతో వెలగగలదు. తన్మూలమున లోకకల్యాణముకూడా చేకూరగలదు.

3. ఇంకోసూచనచేసి ఇంతటితో విరమిస్తున్నాను.

పత్రికలు నడపడం ముఖ్యముగా చందాదారుల సంఖ్య వృద్ధిచేసికొని తద్ద్వారా డబ్బు సంపాదించుకోవడానికే గదా! గవర్నమెంటువారుకూడా కొన్ని పత్రికలు నడుపుతున్నారు గాని వారు చందాదారులసంఖ్య వృద్ధిపొందించడానికి తగిన ప్రయత్నాలు జరపడములేదు. జిల్లాగెజట్టు, రాష్ట్ర గెజట్టు

ఇవి దొరతనమువారి పత్రికలు. ఇవి కొందరు ఉద్యోగస్థులే చదువుతారుగాని అందరూ చదవరు. నిజానికి ఇవి అందరూ చదవవలసిన పత్రికలే. వీటిని అందరిచేతా చదివించడానికి మార్గం ఇతర పత్రికలవలె ఇవికూడా ప్రజలను ఆకర్షించేటట్లు చేయడం. అందుకోసమై ప్రతిసంచికలోనూ, బొమ్మలూ, చిన్నకథలూ, నాటకాలూ, హాస్యాలూ ప్రచురించడం చాలా లాభకరమైన విషయము. ఇందుకోసం వారు ప్రత్యేకంగా వ్యాసకర్తలను తడుముకోవలసిన అవసరములేదు. చేతినిండా పనిలేని గవర్నమెంటు ఉద్యోగస్థులు అన్ని శాఖలలోనూ అనేకమంది ఉన్నారు. వారినందరినీ వ్యాసాదులు వ్రాయమంటే తప్పకుండా వ్రాస్తారు. అందువల్ల పత్రికలు బాగుంటాయి. ప్రజలను ఆకర్షిస్తాయి. చందాదారులసంఖ్య వృద్ధి అవుతుంది. డబ్బుకూడా చాలావస్తుంది. సులభముగా ప్రజలను సంతోషపెట్టి డబ్బు సంపాదించగలిగిన ఈ మార్గమును తప్పకుండా పాలకులు అనుసరిస్తారని మనవి.

ప్రజలు డబ్బు సంపాదించడానికి ఫీజులు వసూలుచేసే సందర్భాలు అనేకం ఇదివరలో చెప్పి ఉన్నాను. అవి గాక ఇంకా ఎవరిబుద్ధికి తోచినట్లు వారు ఫీజులు వసూలు చేసుకోవచ్చు. ప్రజలకు ఈహక్కు దయచేస్తూ ఒకశాసనము కూడా శాసనసభలవారు అమలులో పెట్టినట్లయితే చాలా బాగుంటుంది.

ఇటువంటి అమూల్యమైన వ్యాసం వ్రాసి లోకోపకారం చేసినందుకు ప్రజలు నాకు ఎంత ఫీజు ఇవ్వవలసి ఉంటుందో!

1930